

**చాలామంది స్నేహాలు చిరుప్రాయంలో బలంగా తయారయి, లతలా అల్లుకుపోయి, ఆ తరవాత పరిస్థితుల ఒత్తిడికి విరిగి నీళ్ళపైన పడ్డ రూపాల్లా** చెదిరిపోతుంటాయి. ఆనాటి స్నేహం ఒకనాటి కలలోని సంఘటనలా మారి, గత స్మృతిగా మిగిలిపోతుందేగాని, స్నేహపు నందనవనం మరల పల్లవించదు. చిట్టచివరకు స్నేహితులందరూ చెరోక దిక్కికీ ఎగిరిపోయే పక్షుల్లా తయారయి ఒకరి ముఖాన్నొకరు చూసుకొనే భాగ్యానికి నోచుకోరు. మా స్నేహం అలాంటిది కాదు. రామారావు, తిరుపతి, శాస్త్రి, నేనూ ఒకే స్కూలులో ఒకే తరగతిలో చదువుకొని, అటుపిమ్మట కాలేజీలో చేరాం. ఆ సమయాన రామారావుకీ, తిరుపతికీ ఒకే కాలేజీలో సీట్లు దొరక్క పదిమైళ్ళ దూరాన ఉన్న మరో కాలేజీ వెతుక్కుంటూ వెళ్ళారు. అయినా మా నలుగురి మధ్యా ఉన్న స్నేహం స్కూలు రోజుల్లో ఉండేటట్లే ఉండేది. మా మధ్య రాకపోకలు మునుపులాగే ఉండేవి. కాలేజీ చదువులతో మా స్నేహం ఆగనూ లేదు. తగ్గనూలేదు. ఉద్యోగాల రీత్యా మా మధ్య రాకపోకలు అప్పటిలా అధికంగా ఉండకపోయినా, ఉత్తరాల ప్రయాణం మాత్రం ఆగలేదు. అవకాశం చిక్కినప్పుడల్లా ఒకరినొకరు చూసుకోవడం మానలేదు. ఒకరి కష్టాల గురించి ఒకరొకరు తెలుసుకోవడం మానలేదు.

ఒకరోజు తిరుపతి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. "నా మొదటి కూతురికి తగిన వరుణ్ణి వెతికే ప్రయత్నంలో ఉన్నాను. నలుగురైదుగురు అబ్బాయిలను చూశాను. వాళ్ళ ఫొటోలతోబాటు వంశ వృత్తాంతం కూడా సేకరించి ఉన్నాను. మా గృహమున కేతెంచి ఉపయుక్తమైన సలహాలు ఇవ్వవలసింది" అని వ్రాశాడు. అప్పుడు ఒక కార్డుముక్క వ్రాసి పడేశాను. "ఇటువంటి సందర్భాలలో రాముతో సంప్రదించడం మరచిపోవలదు. అలాగని నేను రాననికాదు. నిదానపరుడైన రాము ఇటువంటి విషయాలలో ఉపయోగకరంగా ఉంటాడన్నది మరవకూడదు." అని గట్టిగా చెప్పాను. రామారావంటే నాకుమాత్రమే కాదు. మా మిత్రులందరికీ అతడిపైన అభిమానం అధికం. ముఖ్యంగా అతడి మాటపైన మాకందరకూ గురి ఉంది. దీనికి బలమైన కారణం లేకపోలేదు. ఇంకా చెప్పాలంటే — మా గురి వెనుక ఓ చరిత్రే దాగి ఉంది. పందొమ్మిదొందల యాభైఆరు యాభైఏడు ప్రాంతాన నలుగురు మిత్రులమూ కాలేజీ విడిచిపెట్టి ఉద్యోగాన్వేషణ ప్రారంభించాం. ఆ సమయాన ప్రావిడంటు ఆఫీసు కొత్తగా తెరిచారు. ఆ ఆఫీసులో నలుగురమూ చేరి, ఎల్. డి. సీలుగా పదవీస్వీకారం చేశాం. స్కూలు రోజుల్లో చేరి చదివినట్లే అందరమూ సరదాగా ఓ ఏడాదిపాటు పి. ఎఫ్. ఆఫీసులో పనిచేసాం. మా చూపుకి, ఊహకి ఆఫీసు ఒక కాలేజీగానే కనిపించేది. కాఫీలకు వెళ్ళడం, సాయంత్రంపూట డ్రామాలకు, సినిమాలకు కలిసివెళ్ళడం — అంతా సరదాగా గడచిపోయేది. అప్పుడు ఓ ముఖ్యమైన సంఘటన జరిగింది. మౌంటురోడ్డులో కొత్తగా వెలసిన ఓ ప్రైవేటు కంపెనీ, కనీసం ఓ ఏడాదిపాటు అనుభవం ఉన్న క్లర్కులు కావాలని పత్రికల్లో ప్రకటన చేసింది. అందులో పేర్కొన్న 'పే' స్కేల్సు చూసి ఉక్కిరిబిక్కిరి అయ్యాం. రెట్టింపు బేసిక్ పే! ప్రతి ఏడాదీ బోనస్! సగటు మనిషికి ఇంతకంటే ఏంకావాలి. వెంటనే నాలుగు అప్లికేషన్ ఫారమ్‌లు తీసుకువచ్చి, ముగ్గురమూ ఫిలప్‌చేసి, చిట్టచివరన రామారావుకి ఒకటి అందిచ్చాం. అతడు 'అప్లికేషన్' వేపూ, మావేపూ ఎగాదిగా చూసి "తరవాత చెప్తాను" అని జేబులో పెట్టుకున్నాడు. మాకు నిజంగానే చిర్రెత్తుకొచ్చింది

"తరవాత చూడటం ఏమిట్రా? యమగండం, రాహుకాలం చూసి ఫిలప్ చేస్తావేమిటి? అదైనా చెప్పు" ముక్తకంఠంతో అరిచాం. రామారావు కాసేపు మౌనం వహించి, "నేను ఆ కంపెనీలో చేరను" అని తేల్చాడు.

"అదెందుకో చెప్పు?" శాస్త్రి అడిగాడు.

"నా మనసుకి ఇదే బాగున్నట్లుంది. పని చేస్తున్నప్పుడు తృప్తి కలుగుతూంది."

"మనం పనిచేసేది తృప్తికోసం మాత్రమే కాదురా భాయ్! ఇంతకూ పే స్కేల్సు చూశావా?" వాడిలో ఆశలు అల్లర్లు రేపడానికి ప్రయత్నించాను.

"బోనస్ అంటే ఏమిటో తెలుసా? బోనస్ అంటే అడ్వాన్సు పుచ్చుకోవడం కాదు." తిరుపతి సహనాన్ని కోల్పోతూ అన్నాడు. రామారావు కదలలేదు. మా దారిన పడలేదు.

"మనిషికి మనోనిగ్రహం అవసరం. ఇది ఉన్నవాడు సముద్రమంతటి వాడవుతాడు."

"ఎలా?" ఒక్కసారిగా అరిచాం.

"పలు తావులనుండి నదీజలాలు ఎడతెరపి లేకుండా సముద్రంలో పడుతుంటాయి. సముద్రం ఒక్కనాడయినా పొంగిపొరలిందా? తన తీరాన్ని



# సముద్రం

*

పాండ్రంకి సుబ్రమణి

వాటివచ్చిందా?'' మావేపు ప్రశ్నను విసిరి, ఓసారి ఆగి, చిన్నగా నవ్వాడు.

''ఇంతకూ నువ్వేమంటావు?'' ఈసారి నేనె ముందుకు వచ్చి ఖచ్చితంగా తేల్చాలన్న కంఠస్వరంతో అడిగాను. రామారావు మాతోబాటు కలసిరావడం లేదన్న బాధ గుండెనిండుగా పేరుకుంది. రామారావు తన ధోరణి మార్చాకాడు.

''సముద్రాన్ని మనసంటాను. నదీజలాలను ఆశలంటాను. అజాగ్రత్తగా ఉంటే కొట్టుకుపోతాం అంటాను.''

మేం ఇక మాట్లాడకుండా అప్లికేషన్లు సమర్పించి వచ్చాం. కొన్నాళ్ళకు అపాయ్‌మెంటు ఆర్డర్లు చేతికందిన తరవాత ప్రభుత్వోద్యోగాలకు రాజీనామాచేసి కంపెనీలో చేరిపోయాం. రామారావు ఒక్కడూ అలా తక్కువ జీతంతో పి ఎఫ్ ఆఫీసులో వుండిపోవడం మమ్మల్ని అమితంగా బాధపెట్టింది. రెండేళ్ళు వరసగా బోనస్‌లు అందుకున్నాం. మూడేళ్ళు హయ్యర్ పే స్కేల్సు అందుకున్నాం. ఆ తరవాత అంతా మూన్నాళ్ళ ముచ్చటనుమా అన్నట్లు -- మమ్మల్ని అగాధంలోకి తోసేస్తూ, ఆకాంక్షలను నిరాశల నిప్పుల్లో పడేస్తూ కంపెనీ మూతబడింది. మూతబడటానికి కారణాలు వేయి వుండవచ్చు. కాని ఫలితం? శూన్యం. అప్పటికి మాకు పెళ్ళిళ్ళు అయి బిడ్డాపాపలు కూడా తయారయ్యారు. నామటుకు నాకు మరో ఏడాదిగాని దాటితే గవర్నమెంటు సర్వీసుకి పనికిరాకుండా పోయే ప్రమాదం ఎదురయింది. ఈసారి మరింత సీరియస్‌గా, మరింత సిన్సియారిటీతో ఉద్యోగ ప్రయత్నాలకు దిగాం. అప్పటికప్పుడే యు డి. సి. గా ప్రమోషన్ పొందిన రామారావు మాతోబాటు ఎండల్లోపడి, మాకు తోడుగా తిరిగాడు. ఎవరకు నానాతిప్పలూ పడి స్టేట్ గవర్నమెంటు సర్వీసులో చెరొక పక్షిగా వివిధ డిపార్టుమెంటులలో చేరాం.

రామారావు మాత్రం ప్రకృతి పరిష్వంగంలో ప్రశాంతంగా, నిశ్శబ్దంగా తొడిగే మొగ్గలా -- అంచెలవారీగా ప్రమోషన్లు అందుకుంటూ గజిటడ్ ఆఫీసరు అయేంత ఎత్తుగా ఎదిగిపోయాడు.

*  *  *

అనుకున్నప్రకారం మిత్రులందరమూ ఓ ఆదివారంపూట తిరుపతి ఇంట్లో గుమిగూడాం. మాకోసం చేగోడీలు, అరిసెలుచేసి పెట్టాడు తిరుపతి. చేసిపెట్టడం అంటే భార్యచేత తయారుచేసిపెట్టడం కాదు. పాకశాస్త్రంలో ఆరితేరిన చేయి కాబట్టి తిరుపతే స్వయంగా చేసి మా ముందుంచాడు. ఆ రోజుల్లోనే వాడి పాకశాస్త్రాన్ని గుర్తించి, ''నీకు కాబోయే పెళ్ళాం అదృష్టవంతురాలురా!'' అని ఎగతాళి పట్టించేవాళ్ళం. కాని ఇప్పుడు వాడికి నిజంగానే పెళ్ళాం వుంది కాబట్టి, ఆనాటి మాట జ్ఞప్తికి వచ్చినా ఏమీ ఎరగనట్లు విట్సు కొడుతూ, పకపకల మధ్య రోజు ఇట్టే గడిపేసాం. ఆ తరవాత అరిసెలు ఆరగించి, చేగోడీల గిన్నె ఖాళీచేసి రౌండుగా కుర్చీలు వేసుకూర్చున్నాం. అప్పుడు తిరుపతి మా ముందు మూడు ఫొటో లుంచాడు. వాటి వెనుకనే స్టేట్‌మెంట్ ఆఫ్ ఫాక్ట్సు కూడా జతపరిచాడు. ఒకతను ఎం. ఏ. చదివి ఎల్. ఐ. సీలో పని చేస్తున్నాడు మరో కుర్రాడు బి. ఏ. చదివి కెనరా బ్యాంకులో అసిస్టెంటుగా వుంటున్నాడు. మూడవ అబ్బాయి సేల్సు రిప్రజంటేటివ్‌గా వుంటున్నాడు. మాకందరకూ పని తేలికనిపించింది. పెద్దగా తర్జనలు భర్జనలు లేకుండానే బ్యాంకులో పని చేస్తున్న కుర్రాణ్ణి సెలక్టు చేశాం. కాబోయే అల్లుడి ముఖాన్ని విప్పారిన ముఖంతో మరోమారు చూచి, గది గుమ్మం వద్ద నిలుచున్న భార్యకు అందిచ్చి, అందరకూ కాఫీలు అందిచ్చాడు. కాఫీ రుచిని చివరికంటూ ఆస్వాదిస్తూ కూర్చున్న సమయాన, నిశ్శబ్దంగా వున్న నూతిలోకి రాతిబెడ్డను విసిరినట్లు, తిరుపతి ఇలా అన్నాడు. ''మరో అబ్బాయి ఫొటో కూడా వుందిరా! కాని అబ్బాయి పైకివచ్చేలాలేడు. అన్నీ ప్రాతకాలపు అలవాట్లు.''

''ఆ ఫొటో కూడా చూపించరా! కుర్రాణ్ణి గురించి తెలుసుకోవడంలో నష్టమేముంది?'' అని రామారావు అడిగాడు.

''ఇది చాల అన్యాయంరా తిరుపతీ! మిత్రుల ముందు అంతా పెడ్తానని కబురుపంపి, నువ్వే ముందుగా నిర్ణయించేసి ఆ కుర్రాడి ఫొటోను దూరంగా వుంచడం అక్రమంరా!'' విపరీతమైన అలుకను ప్రదర్శించాడు శాస్త్రి.

''ఇదిగో! ఆతగాడి గురించి వివరంగా చెప్పి వినిపిస్తే, నేనెందుకు చూపించలేదో మీకే అర్థమవుతుంది'' అని నాలగవ ఫొటోను మా ముందుంచాడు తిరుపతి. నేను ఆసక్తిగా ఆ ఫొటోవేపు పరీక్షగా చూశాను. ముఖం కళగానే వుంది. చూపులు కాస్తంత తీక్షణంగా వున్నాయి. ముక్కు మరీ సూటిగా వుండటంవల్ల మనిషి కోపిష్టిలా కనిపిస్తున్నాడు.

''ఇతడెక్కడ పని చేస్తున్నాడు?'' రామారావు అడిగాడు.

''అంతా చెపుతాను వినండి. రిజిష్టరర్ ఆఫీసులో పని చేస్తున్నాడు.'' తిరుపతి చెప్పడం ముగించకముందే శాస్త్రి అడ్డం వచ్చి, ''ఇంకేం?

రెండుచేతులా సంపాదిస్తున్నాడు కుర్రాడు." అన్నాడు.

"నువ్వూనూ, నీ బోడి ఉత్సాహమున్నూ! పూర్తిగా వినరా!" తిరుపతి తిట్టాడు.

"సారీ, చెప్పడం ఆరంభించు" అని శాస్త్రి క్షమాపణ కోరుకొని మిగిలిన వేగోడీలను నోట్లో పోసుకున్నాడు.

"కుర్రాడు ప్రాతకాలపు మనిషి. తండ్రిగారి అడుగుజాడల్లో నడుస్తానని ప్రతిజ్ఞ పూనాడట. జీతం రాళ్ళను తప్ప మరేదీ ముట్టుకోడట. తండ్రి రిటైర్ అయిన తరవాత విడిచిపెట్టిన డొక్కు సైకిల్‌ని వారసత్వంగా అందిపుచ్చుకొని, దానిని రిపేర్లు చేస్తూ పై మెరుగులు చేసుకుంటూ ఉపయోగిస్తాడట. ఆ సైకిల్‌షాపు వాడు మనసులో కష్టపెట్టుకొని, 'ఇంత డబ్బుపోసి రిపేరు చేస్తున్నారే – ఆ డబ్బుపెట్టి కొత్త సైకిల్ కొనవచ్చుగా' అని సలహా ఇచ్చాడట. అప్పుడీ బుద్ధావతారం ఏమన్నాడో తెలుసా? 'ఇది నీ కళ్ళకు సాధారణంగా కనిపించవచ్చు గురూ! ఇది మా తండ్రిగారి ముప్పై యేళ్ళ నిష్కళంకమైన ప్రభుత్వ సేవకు సాక్షీభూతం' అని గర్వంగా చెప్పకున్నాడట. ఈ భోగట్టా అంతా ఆ సైకిల్‌షాపు వాడి దగ్గరే సేకరించాను."

"బ్రతకనేర్వనివాడు పాపం!" శాస్త్రి వ్యాఖ్యానం చేశాడు.

"ఇటువంటి వెర్రిబాగులవాణ్ణి చేసుకుంటే ఏ ఆడకూతురు బాగుంటుందని?" తిరుపతి ఫొటోను ముక్కలుచేస్తూ అన్నాడు..

"పుచ్చుకోవడం అనేది అందరూ చేసే పనేగా! దీనిని ఇంగ్లీషులో క్విక్ మనీ అంటారు. పలానిది పుచ్చుకోకుండా ఆఫీసరు పత్రాలపైని సంతకం వేయడు. ఏమీ చేయని ప్యూను కూడా ఏవీ పుచ్చుకోకుండా పత్రాలపైని సీలు వేయడు. ఇంతమంది మధ్య నీతి నియమాలకోసం కొట్టుమిట్టాడుతూ తిరుగుతూన్న అతడు ఈ కాలానికి చెందినవాడు కాడు. సమాజ చక్రంలో ఇటువంటివాళ్ళు నిర్దాక్షిణ్యంగా నలిగిపోక తప్పదు." నేను ఆ అబ్బాయి చేతగానితనానికి నొచ్చుకుంటూ అన్నాను.

"ఇంతకూ అతడెందుకు పుచ్చుకునే పద్ధతిని తిరస్కరిస్తున్నాడో తెలుసా?" శాస్త్రి అడిగాడు.

"హాఁ! అంతా ఆ కుర్రాడి మిత్రుడైన సైకిల్ దుకాణం వాడే చెప్పాడు. ఎవరైనా నచ్చచెప్పే ధోరణిలో – 'మీతో చేరినవారు, కొత్త సైకిల్ కేం కర్మ! కొత్త స్కూటరు కొనుక్కుంటున్నారు. మరో మూడేళ్ళలో ఇల్లు కట్టుకుంటారు. మీరు మాత్రం ఇలా వెనకబడిపోతే ఎలా?' అని అడిగితే, అతడు తలబిరుసుతో ఇలా అంటాడట. "నేనెప్పుడూ వెనుకబడను. ఎందుకంటే – ఐ యామ్ నైదర్ ఎ థీఫ్ నార్ ఎ బెగ్గర్ తెలిసిందా?" ఇది విని అందరమూ గట్టిగా నవ్వాం. తిరుపతి సతీమణి మరోమారు తీసుకువచ్చి అందిచ్చిన కాఫీలు సేవిస్తూ వుండిపోయాం.

"నేను తిరుపతికి ఒక విషయం చెప్పాలి. మీరందరూ అలాగే కూర్చోండి" రామారావు గొంతు విని అందరమూ ఆశ్చర్యంగా తలలెత్తి చూశాం. రామారావుని ఆశ్చర్యంగా చూస్తూ తిరుపతి చతికిలబడ్డాడు.

"తిరుపతీ! ఒకటి చెప్తాను వింటావా?"

"చెప్పరా!"


"నీ కూతురిని నువ్వు చింపిపారేసిన ఫొటోలో ఉన్నాడే – ఆ కుర్రాడికి ఇవ్వు."

ఉలిక్కిపడ్డాం. ఒకరి ముఖాలొకరు చూసుకున్నాం.

"అదేమిట్రా రామూ! అందరమూ ఆలోచించి నిర్ణయం చేసిన తరవాత ఈ కొత్త సూచన యేమిట్రా?" తిరుపతి గొంతులో తత్తరపాటు కనిపించింది.

"అది నా పొరపాటు కాదు. నువ్వు ఆ ఫొటో ఇంతకుముందు చూపించలేదు." రామారావు నిదానంగా అన్నాడు. బరువైన నిశ్శబ్దం అక్కడి వాళ్ళను దట్టమైన దుప్పటిలా కప్పివేసింది. చిట్టచివరకు కథ ఏదోలా తిరగడం చూసి తిరుపతి ముఖం వెలవెలబోతూంది.

"మెజారిటీ చర్చించినపిదపనే కదూ ఈ


గవర్నమెంట్ సోప్ ఫ్యాక్టరీ, బెంగుళూరు వారి విశిష్ట ఉత్పత్తి మార్కెట్ చేయువారు మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బెంగుళూరు. MCA-MSS-61-Tel

నిర్ణయానికి వచ్చాం ?'' నేను రామారావుని సూటిగా చూస్తూ అడిగాను.

''మై డియర్ ఫ్రెండ్ చలపతీ! ఆడపిల్ల జీవితాన్ని మెజారిటీలు తీర్చిదిద్దలేవు. ఆదర్శాలకు ఆవేశాలకు అవినావసంబంధం ఉందనే విషయాన్ని నేను విస్మరించడంలేదు. కాని ఆ అబ్బాయి ప్రదర్శించేది ఆదర్శం మాత్రమేకాదు. క్యారక్టర్! మరొకటి మంచిపోకు. ఆడపిల్ల బ్రతుకును పదవితో — పుష్కలమైన జీతంతో ముడిపెట్ట కూడదు.'' చెంప ఛెళ్ళుమన్నట్లయింది. రామారావు తన నిర్ణయాన్ని గట్టిగా చెప్పడం మాత్రమే కాదు. మా ముగ్గుర్నీ ఎత్తిపొడుస్తున్నాడు. ఆనాటి మా పొరపాటుకి రూపులు దిద్ది మా ముందు ఉంచుతున్నాడు.

''మొండితనం పనికిరాదు రామూ! అందరమూ కలసి తీసుకున్న నిర్ణయాన్ని నువ్వొక్కడివీ ఇప్పుడు కాదనడం బాగాలేదు.'' నేను గట్టిగా అన్నాను. అప్పుడు రామారావు తిరుపతి వేపు తిరిగి, ''నువ్వేమంటావు ?'' అన్నట్లు చూశాడు. తిరుపతికి కోపం వచ్చినట్లుంది. ముఖం ఎరుపెక్కింది. ఆవేశంతో ఏదో చెప్పబోయి, విఫలుడయాడు. రామారావు పెదవుల పైని సన్నటి హాసరేఖ మెరిసి మాయమయింది.

''ఐయామ్ సారీ! మిమ్మల్నందరినీ చాలా ఇబ్బందిలో పెట్టేసాను. అయినా నేను చెప్పాల్సింది చెప్పాలికదా! ఆనందానికి స్థిరత్వం ఉండాలి. ఎటువంటి స్థిరత్వమో తెలుసా ? తల్లి ప్రేమలో ఉన్నంతటి స్థిరత్వం ఉండాలి. ఇది మంచి హృదయుడైన ఆ అబ్బాయిలో వుందని నమ్ముతున్నాను. ఇది నా అభిప్రాయం. అంతే! మరి నేను వెళ్ళొస్తాను.'' రామారావు కదిలాడు. అప్పుడు ''బాబాయ్, ఆగండి!'' అన్న గొంతు విని అతడు ఆగాడు. తిరుపతి కూతురు గుమ్మం వద్ద నిలుచుంది.

''మీ నిర్ణయంతో అంగీకరిస్తాను బాబాయ్.'' ఈ మాటలంటూ ఆమె లోపలకు వెళ్ళిపోయింది. రామారావు అందరికీ చేతులూపి వెళ్ళిపోయాడు.

* * *

మరో నెలరోజుల తరవాత తిరుపతి దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. ఆతృతగా కవరు చించాను.

మిత్రుడు చలపతికి —

మీరందరూ వెళ్ళిపోయిన తరవాత ఆ రాత్రి చాలాసేపు ఆలోచిస్తూ గడిపాను. మా ఆవిడ పక్కకు వచ్చి, ''ఎందుకండీ అంత కలవరపడి పోతారు ? మీ కూతురు. మీ అల్లుణ్ణి వెతికే అధికారం మీకు లేకుండా మరెవ్వరికండీ వుంది ? రామారావుగారు అభిప్రాయం తెలిపారు. ఆయన అభిప్రాయాన్ని శిరసావహించాలని ఎక్కడా లేదుకదా ?'' అని పలుసార్లు ధైర్యం చెప్పింది. కాని నాకు ధైర్యంచిక్కలేదు. రామారావు అభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్ణయం చేయటమా ? కంపరమెత్తిందంటే నమ్ము. చివరకు వాడి అభిప్రాయం ప్రకారం పెళ్ళిచూపులు ఏర్పాటు చేశాం. జరిగిందంతా వివరంగా వ్రాస్తున్నాను. చదువు.

అబ్బాయి తన తండ్రిగారితోబాటు వచ్చాడు. అమ్మాయిని అలంకరించి వాళ్ళ ముందుకు తీసుకువచ్చి కూర్చోబెట్టారు. నేను ఎవ్వరినీ గమనించలేదు దేనినీ గమనించలేదు. ఆ కుర్రాణ్ణి మాత్రమే చూస్తూ కూర్చున్నాను. తండ్రి ఒక్క పలుకులేకుండా అక్కడి తతంగాన్ని ప్రేక్షకుడిలా చూస్తూ కూర్చున్నాడు. అమ్మాయిని చూసిన వెంటనే అతను చిన్నగా నవ్వి, ''గుడ్ ఈవ్‌నింగ్'' అన్నాడు. ఆ కొత్త పద్ధతి చూసి అందరూ తెల్లబోయి చూశారు. అమ్మాయి ఓసారి అతడివేపు తలెత్తి చూసింది. అతడు వేసిన మొదటి ప్రశ్న గమనించు.

''నేను నిజం చెపుతున్నానండి. నాకు వంట చేయడం చేతకాదు. మీకు వంట చేయడం వచ్చా ?'' మా అమ్మాయి మాలా ఆశ్చర్యపోలేదు సరికదా—అతడివేపు చూసి నవ్వింది. అమ్మాయితో బాటు అక్కడివాళ్ళందరూ నవ్వారు. అప్పుడు మా ఆవిడ కలుగజేసుకొని, ''వంట నేర్పించకుండా వుంటామా నాయనా ?'' అని అంది.

''మరోలా అనుకోకండి. వంట బాగా వుండాలన్నది షరతు కాదు. హోటల్లో తినడం అంటే నాకు మొదట్నించీ అయిష్టం. మరో ముఖ్యమైన విషయాన్ని విన్నవించాలి. మా అమ్మ వయసు మళ్ళిపోయింది.'' కాసేపు మౌనంగా గడచిపోయింది. గాత్రం గురించి, చదువు గురించి ఏదైనా ప్రశ్నలు వేస్తారేమోనని ఎదురుచూశాను. వాళ్ళు అటువంటివేమీ అడగ లేదు. టిఫిన్ ఆరగించి, కాఫీలు సేవించి, తండ్రీ కొడుకులిద్దరూ లేచారు.

''కట్నం కానుకల గురించి మాట్లాడకుండానే వెళ్ళిపోతున్నారు ?'' అబ్బాయి తండ్రిని చూస్తూ అడిగాను. ఆయన మహా గంభీరంగా,

''కుర్రాణ్ణే అడగండి'' అన్నాడు.

''నాకు మీరేమీ కొనివ్వనవసరంలేదు. వాచీ నేనే కొనుక్కుంటాను. కొత్త దుస్తులు నేనే కొనుక్కుంటాను. అమ్మాయిగారికి కొత్త చీర కొనిపెడతాను. మీరు మాత్రం ఒక సహాయం చేయాలి.'' ఏమిటన్నట్లు ఆతృతగా చూశాను.

''మీ ఖర్చుతో పెళ్ళి జరిపించండి. మొన్ననే మా అమ్మ జబ్బుపడింది. ఖర్చులు అధికంగా అయాయి.'' అని లేచి నమస్కారం పెట్టి, తండ్రితోబాటు వెళ్ళిపోయాడు.

పెళ్ళికి తేదీ నిర్ణయంచేసి వాళ్ళ ఒప్పుదల కోసం ఉత్తరం వ్రాసాను. దానికి బదులుగా అబ్బాయి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. ఉత్తరం ఎవరి పేర వచ్చిందనుకున్నావు ? మా అమ్మాయి పేర వచ్చింది.

కుమారి పుష్పలతగారికి —
నమస్కారం.

మీ తండ్రిగారు మా తండ్రిగారికి వ్రాసిన ఉత్తరం చదివాను. మీ నాన్న పెళ్ళి తేదీని ఖాయం చేయమని వ్రాశారు. మీవంటి అందమైన అమ్మాయి నాకు భార్యగా లభించడం నా అదృష్టం. మీ చూపుల్లో కానవచ్చే ధైర్యం, చురుకుతనం నాకు నచ్చాయి. వాటివల్లనే తేల్చుకున్నాను — మీరు బాగా చదువుకున్నవారని. కాని నేను ఇంత త్వరగా పెళ్ళిపీటలపైన కూర్చోగల స్థితిలో లేను. మా తమ్ముగారు ఇంకా తేరుకోలేదు. ఆ! మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే — మూడవసారి పోరాటంచేసి ఐ. ఏ. ఎస్. అనే అగ్నిపరీక్షలో నెగ్గాను. ఢిల్లీలో ఇంటర్వ్యూకి కూడా హాజరయి వచ్చాను. నిన్ననే నన్ను అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుగా పోస్టింగ్ ఆర్డర్సు వచ్చాయి. డ్యూటీలో జాయినయి కనీసం మూడు నెలలయినా ఉద్యోగ నిర్వహణ చేస్తేగాని బాగుండదు. అందువల్ల పెళ్ళిని మూడునెల్లకు వాయిదా వేయమని కోరుతున్నానని మీ నాన్నగారికి తెలియజేయండి.

శ్రమ అనుకోకుండా వెయిట్ చేస్తారు కదూ! అన్నట్టు చెప్పడం మరిచాను. మీరు మా నాన్నగారికి బాగా నచ్చారు.

జమదగ్ని.

మళ్ళీ రామారావే నెగ్గాడురా!

తిరుపతి. ●

